

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**ఎ..డాగ్ ఇన్ ద బేగ్**

మీరనుకోవచ్చు.. ఏమిట్రా యీ సీత కొన్ని పేజీలు యమా ఫాస్టుగా చదివించి మళ్ళీ కొన్ని పేజీలు 'స్లో' చేస్తూ వర్ణనలూ వ్యవహారాల్తో నింపుతోందని. ఆర్యులారా..మీకో విన్నపం. అప్పటి గ్రామాలూ తాలుకాలూ అప్పుడు మేము పాటించిన సాంప్రదాయాలూ, అవీ కొంచెం తేడాగా ఉంటై. అని మీకు తెలియాలంటే కొంచెం 'ఓర్పు'తప్పదు. ఇది మూడోసీత అనబడే నా జీవితం. సస్పెన్సుని దట్టిస్తూ ఊహాత్మకంగా రాసే నవలకాదు.

నాటి జీవన విధానం ఎంత 'సింపుల్'గా ఉండేదో, మనుషుల మధ్య అనురాగాలూ ఆప్యాయతలూ ఎలా ముడివేసుకుని ఉండేవో తెలిస్తేగానీ 'ఇప్పటి జీవితపు' సంఘర్షణ మీకు తెలీదు. సంభాషణలు మాత్రమే చదివేవాళ్ళని నా విన్నపం ఏమిటంటే, దయచేసి మిగతా భాగాల్ని అంటే, సంభాషణలేని భాగాన్ని కూడా నాకోసం చదవమని.

అప్పుడు కులాలూ మతాలూ వర్ణాలూ ఉన్నై. కానీ వాటి మధ్య 'ద్వేషం'వేరు. పిల్లలం ఆటలాడుతూ ఉంటే అందరూ సంతోషించేవారు. 35 మార్కులు తెచ్చుకుని పాసైతే, 'మా అబ్బాయి (లేక) మా అమ్మాయి పరిక్ష పాసైంద'ని గర్వంగా చెప్పుకునేవారే కానీ, నూటికి నూరుమార్కులూ రావాలని పిల్లల్ని 'పీ...డిం...చే' వాళ్ళు కాదు. అందుకే మా బాల్యాన్ని మేము నిండుగా అనుభవించాం. బాల్యం హాయిగా ఆడుతూ పాడుతూ గడిచిపోయేది.

ఒకవేళ ఏ పిల్లవాడైనా తప్పుచేస్తే, ఆ తప్పు సరిదిద్దటానికి కులమతభేదాలు లేకుండా అందరూ ప్రయత్నించేవారు. ఉదాహరణకి మేము వానల్లో ఆనకట్టలు కడుతుంటే, "ఏమ్మా సీతా? ఇట్లా వానలో తడిసి జలుబో జ్వరమో తెచ్చుకుంటే నీవాళ్ళు ఎంత బాధపడతారూ? అసలీ వాననీళ్ళతోపాటు ఎన్ని కొట్టుకొస్తాయో తెలుసా? అసహ్యంగా లేదూ?" అని ఎవరైనా సరే నన్నూ నా స్నేహితుల్నీ మందలించేవారు. ఆ మందలింపు ఎటువంటిదీ? సొంత బంధువులు మన మంచికోసం చేసే మందలింపులాంటిది.

ఇవాళైతే, "మా కులం పిల్లాడిని మీ కులం వాడు మందలించాట్ట ఎంత ధైర్యం?" అని ప్రతాపాలు చూపిస్తున్నారు.

"మా వాడ్ని బాగా చదివించండి మాస్టారూ! వెధవ కళలు వేస్తే మక్కెలిరగదన్నండి!" అని టీచర్లని తల్లిదండ్రులు బతిమలాడేవారేగానీ, ఇవాళ్టిలాగా, "మావాడి చెవులు మెలిపెట్టావుట గదోయ్. హత్యాప్రయత్నం చేస్తావా?" అని గ్యాంగ్‌ని వెంటబెట్టుకుని టీచర్లని బెదిరించలా. అంతెందుకూ, "మీవాడు ఎస్సెల్సీ పాసయ్యాడుగదా.. ఉద్యోగానికి పంపకూడదా?" అని ఎవరన్నా అడిగితే, "ఎవడి మోచేతి కింద నీళ్ళోతాగే ఖర్మ మాకెందుకండీ! మా కులవృత్తి మాకుంది. మావాడు రాజులా బతకొచ్చు!" అనేవాళ్ళు. తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య ఆస్తితగాదాలొస్తే, "చచ్చేటప్పుడు యీ ఆస్తిని కట్టుకు పోతామా? ఎందుకయ్యా గొడవలు?" అని సద్దిచెప్పేవాళ్ళేగానీ, కోర్టులచుట్టూ తిరిగేవాళ్ళుకాదు.

సంవత్సరానికి నాలుగు జతల బట్టలు కొనుక్కోగలిగితే చాలు వాడు మహారాజే. ఆకలి చావులు లేవు. 'మంచినీళ్ళు' సీసాల్లో అమ్ముకోవటం ఊహకి కూడా అందని రోజులవి.

ఇళ్ళముందు అరుగులు వుండేవి ఎవరైనా అలిసిపోయి కూచుంటే, "ఇందబాబూ... యీ మజ్జిగతాగు!" అని మానవత్వంతో నీళ్ళు మజ్జిగా ఇచ్చేరోజులవి. ఒకర్ని చూసి ఒకరు అసూయపడేకాలం కాదది.

నేనేమీ కృతయుగం గురించి మాట్లాడటంలా. కేవలం '55' సంవత్సరాల క్రితం విషయం ఉన్నదున్నట్టుగా చెబుతున్నా. అంతే.

సృష్టిలో సర్వజీవులూ మనతోపాటు హాయిగా ఉండగలిగితేనే మనమూ మనగలుగుతాం. బహుశా పండగలు అందుకే ఉన్నాయనుకుంటాను. మార్గశిరమాసంలో వచ్చే 'కోర్లపౌర్ణమి' గురించి చెప్పకపోతే 'ఉత్సాహవంతమైన బాల్యపు 'రుచే' ఉండదు. ఆ కోర్ల పౌర్ణమినే 'కుక్కలపండగ' అంటారు (కోరల పౌర్ణమి అనేది సరైన పదం)

మా అమ్మ మధ్యాహ్నం మూడింటికల్లా 'పిండి' రెడీచేసేది. బియ్యపు పిండీ అలచందలూ వేడినీళ్ళతో కలిపి రొట్టెలు తయారు చెయ్యడం మొదలెట్టేది. ఓ పెద్ద ఇత్తడి పాత్ర లోపల నూనె రాసి, మందంగా చేత్తోనే చేసిన మందపాటి గుండ్రమైన రొట్టెల్ని లోపలవైపు అతికించేది. ఇప్పుడు ఆ పాత్ర కట్టెలపొయ్యి మీద పెడితే, ఆ రొట్టెలు మెల్లగా కాలి ఓ గంటకి అటూ ఇటూగా పాత్ర గోడ నించి విడివడి పాత్రలో పడేవి. తడవకి అయిదారు రొట్టెలు (మన తందూరీ టైపులో) తయారయ్యేవి.

"ఒసే సీతా – నువ్వూ నీ ఫ్రెండ్సూ ఓ మంచి కుక్కని పట్టుకురండే!" అని నింపాదిగా ఓ ఆర్డరు పాస్ చేసేది.

"ఒక్కదాన్నే నా, రెండు మూడు కుక్కల్ని తేవాలా?" జవాబు నాకు తెలిసీ అడిగేదాన్ని.

"ఒకటి అయితే సాంప్రదాయం, రెండైతే శ్రేష్టం, ఇహ మూడైతే శుభకరం!" అనేది.

చలో కుక్కల వేటకి. భుజం మీద గోని సంచితో.

"ఒరే మద్దిమత్తెనోడా.. కుక్కని పట్టాలా!" అనగానే వాడు ఓ గోనె సంచీ భుజానవేసుకుని, "వస్తాను..పడదాము.. కానీ, మొదట మా యింటికే తీసికెళ్ళాలి!" అనేవాడు.

"పిచ్చివాడా.. ముందు కుక్కని పట్టడం ముఖ్యంగానీ, ఎవరింటికనేది కాదురా. అది తరవాత ఆలోచించాల్సిన మాట!" ఇదీ ప్రతిసంవత్సరం నేనిచ్చే జవాబు. చిత్రం ఏమిటంటే మేం బజార్లో కుక్కలకోసం వెతుకుతూ వుంటాంగదా, ఏరోడ్డు మీద చూసినా గోనె సంచుల్తో పిల్లలే! కొంతమంది పెద్దవాళ్ళు కూడా సంచుల్తోటో తినుబండారాలతోటో 'వేట' సాగించేవాళ్ళు.

"ఆ వీధికి వెళ్ళటం శుద్ధవేస్టురా సూర్నారాయణా.. మేమిప్పుడే చూసొచ్చాం. ఒక్క కుక్కకూడా లేదు!" అంటూ మిగతావాళ్ళని 'మిస్‌గైడ్' చేసేవాళ్ళం. వాళ్ళు మాత్రం తక్కువ తిన్నారా, "అవునే సీతా, అసలు మనవూరి అన్నివీధులూ తిరగేసే వస్తున్నాం. ఒక్కటికూడా కనపడలేదే!" అని కన్‌ఫ్యూజ్ చేసేవాళ్ళు.

ప్రతిరోజూ ఎక్కడ బడితే అక్కడ కుక్కలు కనిపించేవి. వాటి 'పండగ' వచ్చినరోజున మాత్రం అవి వి.ఐ.పిలయి కొండెక్కి కూచునేవి.

కుక్కని పట్టాలంటే చాలా ఒడుపూ చాలా నైపుణ్యం కావాలి. మద్దిమత్తెనోడు ఇంట్లో కనీసం పదిపుంజులూ పదిహేను ఇరవై పెట్టలూ వుండేవి కనక, కదలికల్ని బట్టి అవి ఎటు తిరుగుతయ్యో రోజూ గమనిస్తాడు గనక, ఆ టెక్నిక్‌నే కుక్కల మీద ప్రయోగించేవాడు.

చులాగ్గా కుక్క వెనక్కాళ్ళు పట్టుకుని పైకెత్తి గభాల్న గోనెలో పడేసి గోనె సంచీ మూతి మూసేసేవాడు.

మొత్తానికి ఓ రెండు గంటలు కష్టపడితేగానీ కుక్క దొరికేదికాదు. మిగతా రోజుల్లో 'దూ..దూ..' 'చూ..చూ..' అని సవ్వడి చెయ్యగానే తోక వూపుకుంటూ దగ్గరికొచ్చే కుక్కలు, కోరల పౌర్ణమి రోజున మాత్రం మహా 'టెక్కు' పోయేవి.

రోడ్డుమీద కుక్క కనిపిస్తేచాలు.. ఓ ఇరవైయ్యో ముప్పయ్యో గొంతులు 'దూ..దూ..' అని అరిచేవి. దాంతో కుక్కకి తారుపుట్టి లగెత్తేది.

మాక్కావలసింది అదే క్రీగంట దానివైపు చూస్తూ, దానికి ఏమాత్రం 'హింట్' ఇవ్వకుండా ఫటాల్న పట్టేవాడు మద్దిమత్తిన సుభాష్ బోసుగాడు.

ఆ తరువాత మా మధ్య మళ్ళీ ఓ డిస్కషను.

"ఒసే సీతా.! నేను ముందరే చెప్పాను. ముందు మా ఇంటికి..!"

"దానికేం, అలాగేరా.! కానీ.. " నేను కాస్త సస్పెన్సు క్రియేట్ చేసేదాన్ని.

"అంటే?"

"నీకు మంత్రం వొచ్చా?"

"ఏ మంత్రం?"

"రొట్టెముక్కలు వేసేటప్పుడు చెప్పాల్సిన మంత్రం!" గంభీరంగా అనేదాన్ని.

"రాదనుకో.! కానీ నువ్వు చెప్పొచ్చుగా?"

"పిచ్చివాడా.! మంత్రం పనిచెయ్యాలంటే 'మడి' కట్టుకున్న వాళ్ళు చెప్పాలి. మా అమ్మ ఇంట్లో రెడీగా వుంది. నువ్వుకూడా మా ఇంట్లోంచే మంత్రం చెప్పి ఓ రొట్టె కొరికి, ఆ తరువాత మహారాజాలాగా ఆ కుక్కని మీ ఇంటికి తీసికెళ్ళు. ఒకమాట ముందే నీకు చెప్పాలి. మా అమ్మ నన్నుకూడా 'మడి'తో ముట్టుకోవటానికి వీల్లేదు గనక, మా అమ్మ దగ్గర్నించి మంత్రం ముందు నేను నేర్చుకుని తరువాత నీకు చెప్తానన్నమాట.! సరేనా?"

"అలా అయితే ఓకేనే!"

"ఇంకో విషయం కూడా నీకు చెప్తున్నా. మధ్యలో దివాయ్‌గాడుగానీ, వాళ్ళ అమ్మగానీ, వాళ్ళబామ్మగానీ నిన్ను ఆపే ప్రయత్నం చెయ్యడానికి బోలెడు అవకాశాలున్నాయి. అందుగురించి జాగ్రత్తపడటం మంచిది!" హెచ్చరించా.

మామూలుగా అయితే చెప్పనుగానీ, నిన్న దివాయ్‌గాడు వాళ్ళింట్లో నించి అయిదారు శనగపప్పు వుండలు తెచ్చికూడా మాకెవరికీ 'పిసరంతైనా' పెట్టలేదు. ఆ 'కచ్చ' తీర్చుకోవాలిగదా!

***రొట్టెరెడీ.. కుక్కరెడీ.***

"సుభాషూ.. మూతి పూర్తిగా విప్పకు. కేవలం దాని తల మాత్రమే బయటికి పెట్టు. పొరపాటున అది బయటికి వచ్చిందో, మళ్ళీ పట్టడం మనవల్లకాదు!" అని వాడికి జాగ్రత్తలు చెప్పి, "అమ్మా.. మేం రెడీ.. నేను లోపలికొస్తాను. ముందు నాకు మంత్రం చెబితే నేను తరువాత సుభాషుకి నేర్పుతా!" అని లోపలికి పరిగెత్తా.

"మంత్రం ఏమిటే?" ఆశ్చర్యంగా అడిగింది మా అమ్మ.

"అది నేను చూసుకుంటాగానీ, నువ్వు నేనేం చేసినా మాట్లాడకు!" అని గుసగుసగా మా అమ్మతో చెప్పా. తలో రొట్టె తీసుకుని బయటికి వచ్చాం. మూడు మూడు ముక్కల్ని కొరికి కుక్కముందు పడేశాం. అది తెగ మొరాయించింది. వదిల్తేగా. చేత్తో దానికి అందిస్తేగానీ అది తినలా. ఆ తరవాత మా నాన్న మూడు ముక్కలు కొరికి దానికి వాటిని అందించాడు. మా నాన్నా అమ్మా రాతి తొట్టెలో వున్న నీళ్ళని పుక్కిలించి లోపలికి పోయాక, "ఒరే మద్దిమత్తినోడా, ఓం.. శునకాయనమః" అని మూడుసార్లు అనిపించా. వాడి మొహం పోస్టాఫీసులో బల్బు వెలిగినట్టు వెలిగింది.

"ఈ మంత్రం మావాళ్ళకి నేను చెప్పొచ్చుటే!" ఆనందంగా అడిగాడు.

"నీకు ఇప్పుడు మంత్రం వొచ్చేసింది గనక మహరాజులా చెప్పొచ్చు.!" అని వాడి చేతిలో ఓ రొట్టె పెట్టి వాడిచేతా మూడు ముక్కలు కొరికించి దానికి పెట్టించా.

"అసలెందుకే యీ పండగ చేసేదీ?" అన్నాడు.

"అమ్మా.. యీ పండగ ఎందుకు చేస్తారే?" అరిచా.

"ప్రతిమనిషికీ పళ్ళల్లో, అంటే, కోరల్లో విషం వుంటుందిట. ఇలా రొట్టిని కొరికి కుక్కలకి పెడితే ఆ విషం పోతుందిట. అందుకే ప్రతి యేటా విధిగా యీ పండగ చెయ్యాలి!" అన్నదావిడ.

"బాగుందే!" అంటూ మా మద్దిమత్తెనోడు మళ్ళీ గోతాం మూసి కుక్కని వాళ్ళింటికి పట్టుకుపోయాడు.

నేను పుక్కిలించి వుమ్మేసి లోపలికి పోయాక మిగతా రొట్టెలా మీద మాంఛి వెన్నరాసి ఓ బెల్లం ముక్క చేతిలో పెట్టి, రొట్టెల్ని బెల్లం ముక్కతో నంజుకుని తినమంది మా అమ్మ. ఒక వేపు తెల్లగా వుండి కాలినవైపు కొంచెం గట్టిగా దోసె కలర్‌లో వుండే ఆ రొట్టెల రుచి చెప్పక్కర్లా! మాంఛి ఆవకాయతో కలిపి లాగిస్తే 'స్వర్గం' ఉండేది మన నోట్లోనేగదా!

"ఒక మంచిమాట కోటి రూపాయలకంటే విలువైనది!" యీమాట మాతో చెప్పింది మా కృష్ణారావు మాస్టారు. తెలుగు మాస్టారు కావడంతో ఆయన చాలా పుస్తకాలు చదువుతూ వుండేవాడు. కుక్కలపండగ మరుసటి రోజున, "మాస్టారూ., మనిషి పళ్ళల్లో విషం వుంటుందా?" అని అడిగాను.

"అమ్మాయ్.! పళ్ళ సంగతి ఏమోగానీ 'మాట'ల్లో మాత్రం విషం వుంటుంది ఒక్కమాటతో మనిషిని బ్రతికించవచ్చు. ఒక్కమాటతో మనిషిని చంపెయ్యనూవొచ్చు. అందుకే మనం ఏమి మాట్లాడినా ఇతర్లకి బాధకలక్కుండా మాట్లాడాలి!" అన్నారు.

"మరి వేరేవాళ్ళు మనని తిడితే?" అడిగాడు నాగరాజు.

"అప్పుడూ మనం మంచిగానే మాట్లాడాలి. ఎదుటివాడు దుర్మార్గుడైనంత మాత్రాన మనమూ దుర్మార్గులం కావాల్సిన పనిలేదుగా" నవ్వారు మాస్టారు.

"ఇంకో విషయం కూడా వినండి పిల్లలూ, 'గురుగ్రంధసాహెబ్'లో ఓ మంచి 'శబద్' ఉంది. గురునానక్ గారు చెప్పిన మాట అది, లోపలికి అంటే నోటిలోపలకి పోయేవన్నీ హితవైనవే. ఆఖరికి విషం కూడా మెల్లమెల్లగా అలవాటుచేసుకుంటే లోపలికి పోతుంది. కానీ ఓ మనిషీ - లోపలనించి బయటికొచ్చేవి ప్రమాదపూరితమైనవని గ్రహించు. వచ్చేవి రెండే! ఒకటి వాంతి! అంటే, కడుపులో ఏదో నీకు పడనిది వున్నదన్నమాట. అందుకే పొట్టదాన్ని బయటికి తన్నేసి నిన్ను జాగ్రత్తగా వుండమని హెచ్చరిస్తున్నాడన్నమాట. ఇక నోట్లోంచి బయటికొచ్చే రెండోది 'వాక్కు!' అత్యంత జాగ్రత్త వహించాల్సింది 'వాక్కు' విషయంలోనే. అది నిన్ను అందలం ఎక్కించగలదు. అధఃపాతాళానికీ తొక్కగలదు." అన్నారు.

"అందుకేనా మాస్టారూ, 'నోరా.. వీపుకి దెబ్బలు తెచ్చుకోకే' అంటారూ?" అడిగాను యీ సామెత మా అమ్మ వుపయోగించేదే

"అవును! కాలు వందసార్లు జారినా వెనక్కి తీసుకోగలం, నోరు జారితే వెనక్కి ఆ మాటని తీసుకోలేం గదా!" నవ్వారు మాస్టారు.

ఆ తరువాత మా ప్రవర్తన భలేగా మారింది. ఉదా: ముత్యాలోడిమీద కోపం వచ్చిందనుకోండీ, "ఒరే ముత్యాలోడా.. నిన్ను తెగతిట్టాలని నా నాలిక పీకుతోంది.. కానీ, మాస్టారు చెప్పారు గనక, ఇకనించీ నాకు కోపం వచ్చేలా ప్రవర్తించకు!" ఇది నా మాట.

"అవును సీతా! నాకూ ఇందాకట్నించి నిన్ను లాగి తన్నాలని మహా ఇదిగా వుంది. కానీ, మాస్టారిని గౌరవించాలి గనక - యీ క్షణం నించి నువ్వూ నాతో మర్యాదగా ఉండు"

ఇలా కొన్నాళ్ళు సంభాషణలు సాగాయి. ఆ తరువాత మళ్ళీ మామూలే. కుక్క తోక వంకర.. మనిషి మాట వంకరా.. ఏం చేస్తాం శంకరా!

***రికామీ***

చెరువుకట్టమీద కూర్చుని చెరువులో రాళ్ళు రువ్వటం అనేది ఓ కళ. బుర్రకి మరేమీ తట్టనప్పుడు జరిగే అసంకల్పిత ప్రతీకార చర్య అది. ఓ రాయి 'బుడుంగు'న నీటిలో మునిగి గుండ్రని అలల్ని సృష్టిస్తే, మరో చదరపురాయి నీటిని ఢీకొని ఎగిరి, ఇంకోచోట పడి, మళ్ళీ ఎగిరి గంతులేస్తూ ఓ పది పన్నెండుసార్లు నీళ్ళని ముద్దెట్టుకుని మునుగుతుంది.

మనసు మౌనంలో మునిగినప్పుడు చెయ్యాల్సిన పని చెరువులో రాళ్ళు విసురుతూ, వాటి గమనాన్ని గమనించడం. నేను చేస్తున్న పని అదే. మానాన్న ఊరెళ్ళాడు. మా అమ్మ, "హూ... పన్నెండేళ్ళు వచ్చినా, 'అయ్యో అమ్మ నాకోసం ఇంతకష్టపడుతోందిగదా... కాస్త సహాయం చేద్దాం' అన్నమాటలేదు ఎప్పుడు చూసినా ఆ సైకిలెక్కి చెక్కర్లు కొట్టడం, లేకపోతే ఫ్రెండ్స్ అంటూ బలాదూర్ తిరుగుడు తిరగటం.. ఆడపిల్లననే జ్ఞానంకూడా లేదు. ఎవర్నని ఏం లాభం? చేసుకున్నవారికి చేసుకున్నంత!" అంటూ పొద్దున్నే అష్టోత్తరం మొదలెట్టింది.

ఎంతసేపని వింటాం? వినీవినీ చెవులు 'దిబ్బళ్ళు' కట్టాయి. ఆవిడ చూడకుండా బయటికొచ్చా. ఎవరింటికి పోయినా, "నీకేం తల్లీ. ఏకసంథాగ్రాహివి.. చదవకపోతే మా పని ఇంతే!" అంటూ పుస్తకాల్లో మునిగినవారేగానీ, "పరీక్షల సంగతి తరువాత చూసుకుందాం. పాపం సీత ఇవాళ ఏమీ తోచక గదా మనింటికి వచ్చింది" అనుకున్న వాళ్ళు ఒక్కరూ లేరు. ఏం చేస్తాం. చెరువు కట్టమీద వున్న తుమ్మ చెట్టుకింద కూచుని రాళ్ళు విసిరైనా కాస్త ఆనందించుదామని వచ్చా. ఇద్దరు ముగ్గురుంటే రాళ్ళు విసిరే పోటీ రంజుగా ఉంటుంది కానీ, ఒంటరిగా ఏం బాగుంటుంది?

జేబులో వున్న చాకుని తీసి తుమ్మ చెట్టుకి రెండు మూడుగాట్లు పెట్టాను. క్రామేడ్ సీత 3rd ఫాం అని నా పేరు కూడా తుమ్మ చెట్టు కాండం మీద చెక్కాను. ఎన్నేళ్ళయినా ఇహ ఆ పేరు చెరగదు గదా! ఇంకో లాభం ఏమిటంటే, ఓ రెండు మూడురోజుల తరువాత వస్తే, ఆ గాట్ల దగ్గర గడ్డకట్టిన బ్రహ్మాండమైన తుమ్మ జిగురు దొరుకుతుంది.

ఆ జిగురుతో బోలెడన్ని పనులు చెయ్యొచ్చని 'కొంచెం' సంతోషించా. పైకి చూస్తే బుల్లిబుల్లి కొంగలు కనిపించాయి. ఇంకా రెక్కలు పూర్తిగా రాలేదు.

తల్లికొంగ వీటికి గ్యారంటీగా తినడానికి ఏమైనా తెస్తుంది. కొంచెంసేపు అక్కడే వుంటే, తల్లి కొంగ పిల్లకొంగలకి ఎలా తినిపిస్తుందో చూడొచ్చుగదా! అంతేగాదు., నాలుగయిదు పిచ్చికగూళ్ళు కూడా అందంగా తుమ్మకొమ్మలకి వేలాడుతున్నై.

ఎంత గొప్ప నిర్మాణం! చిన్న చిన్న ముక్కుల్తో ఆ పిచ్చుకలు ఇంత అద్భుతమైన గూళ్ళని ఎలా నిర్మిస్తాయో! అవి చక్కగా గాలికి ఊగుతున్నై. ఎంత హోరుగాలి వచ్చినా అవి పడిపోవుగదా!

చుట్టూ చూస్తే ఓ చీమలపుట్ట. దగ్గరగా వెళ్ళి చూశా. చిట్టిచిట్టి చీమలు వరసగా నడుస్తూ పోతున్నాయి., నెత్తిమీద గడ్డిమోపులు పెట్టుకుని లయబద్ధంగా నడుస్తూ పోయే రైతుపడుచుల్లాగా!

కాసేపు మబ్బుల్ని గమనించా. మెల్లగా ఓ తెల్లమబ్బు నిండుగర్భిణీలా కదిలిపోతోంది. పైన అది వెళ్తుంటే, కిందదాని నీడపడుతోంది. గొడుగు నీడపడ్డట్టు.

పరిగెత్తికెళ్ళి ఆ నీడలో కాసేపు నడిచా. తంగేడి మొక్కలు కనిపించాయి. పచ్చని తంగేడు పువ్వులు ఎంతబాగున్నాయో.

అవతలివైపున రక్కీస పొదలు. ఓరినాయనోయ్.. ఇంతింత పొడుగు ముళ్ళు. రంగురంగుల రక్కీసపూలు. మెట్టతామర పువ్వుల్లాగా. రక్కీసముల్లు గుచ్చుకుంటే అంతే సంగతులు. చచ్చేంత 'తీపు'..., గుచ్చుకున్నచోట. తుమ్మముళ్ళూ అంతే.

ఓ తాటి ఆకుని ప్లస్ ఆకారంలో అమర్చి, తుమ్మముల్లుతోనో రక్కీసముల్లుతోనో దాన్నో 'దంటు' పుల్లకి గుచ్చి పరిగెడుతుంటే, నా సామిరంగా అది 'ఫేన్'లాగా భలే తిరుగుతుంది.

ట్యూబూ టైరూలేని సైకిలు చక్రాన్ని కూడా ఓ పుల్లతో నొక్కి పరిగెడుతుంటే అదెంత మజా!

ముంజికాయల కాలంలో అయితే, ముంజలు తీసేసిన తాటికాయల్ని బండిలాగా కట్టి ఓ తాడుతో దాన్ని లాగుతూ పరిగెత్తడం నాకు మహా యిష్టం. హూ!. యీ చదువులొచ్చి పిల్లల సరదాల్ని పాడుచేస్తున్నై.

చెట్టునీడని బట్టి చూస్తే పగలింకా పన్నెండు కాలేదు. పన్నెండైతే చెట్టునీడకిందే పరుచుకుంటుంది.

ఆహా.! కృష్ణారావు మాస్టారు మొన్న చెప్పినట్టు యీ చెట్టు ఎంతగొప్పదీ!

తను 'ఎండ'లో వుండి అందరికీ నీడ పంచుతుంది.

మనం 'రాయి' విసిరినా అది కోపం తెచ్చుకోదు సరికదా 'కాయ'ని బహుమతిగా ఇస్తుంది.

'గొడ్లకాడి బుడ్డోడు' ఒకడు దూరంగా వున్న మావిడి చెట్టుకింద కూర్చుని కనిపించాడు. వీడ్ని కదిపితే? అయితే మరీ చిన్న వెధవ, ఏడేళ్ళు వుంటాయేమో.

"అన్నం తిన్నావురా?" అడిగాను.

"ఆహా!" అన్నాడు. వాడి కళ్ళు ఉత్సాహంగా మెరుస్తున్నై.

"ఏం తిన్నావూ?"

"మాగాయ్ పెరుగన్నం - అమ్మగోరిచ్చేది అదేగా!"

"మరి గొడ్లేవీ?"

"చెరువుకింద పొలాల్లో మేస్తున్నై.!.."

"అవెక్కడకన్నా పోతే?"

"ఎక్కడికి పోతై? అట్టాపోతే నేను కర్రతో బాత్తానని వాటికి తెల్సుగా!" గర్వంగా అన్నాడు.

"కొడతావా వాటిని? తప్పుకదా?" అన్నా.

"మా యమ్మా నాన్నా నన్ను తన్నడంలా? అంతే!" కళ్ళు చికిలించి అన్నాడు.

"ఆటలేమన్నా వొచ్చా?" అడిగా.

"గోటీబిళ్ళవొచ్చుగానీ, ఇప్పుడు ఆడను."

"ఏం?"

"మేకలుకాసే నా నేస్తుగాడొస్తాడు.. అప్పుడు చూడు!" అన్నాడు. నేను మెల్లిగా లేచా.

"ఇదిగో పాపమ్మాయ్.. మేకపిల్లలాగా పాలు తాగాలంటే వుండు. లేకపోతే పో!" అన్నాడు.

ఆ కథ నాకు తెలుసు.

చిన్నప్పుడు ఒకటి రెండుసార్లు అలా తాగాను.

ఇపుడు బాగోదనిపించింది.

లేచి మళ్ళీ తుమ్మ చెట్టుకిందకొచ్చా. తల్లి కొంగ యీ మధ్యలోనే వొచ్చినట్టుంది. కొంగపిల్లలు కూడా వొచ్చేరాని రెక్కలు విదిలిస్తూ ఉత్సాహంగా అరుస్తున్నై. తల్లి కొంగ తెల్లగా అందంగా ఉంది. కాళ్ళు ఎంతపొడుగో! ఆ ముక్కూ..! మనుషులకీ ఇంతంత ముక్కులుంటే? మా అమ్మనీ నాన్ననీ, నన్నూ, మా మేస్టార్లనీ అందర్నీ అంతంత పొడుగు ముక్కుల్తో వున్నట్టు ఊహించుకుంటే చచ్చేంత నవ్వొచ్చి పడీపడీ నవ్వాను.

పొడుం పీల్చే వాళ్ళు ఆ ముక్కుతో పీల్చాలంటే ఎంత 'నశ్యం'కావల్సి ఉంటుందో లెక్కలేశా. మళ్ళీ నవ్వొచ్చింది.

మళ్ళీ పైకి చూశా. జాగ్రత్తగా చూస్తే ఓ పచ్చని పసిరికపాము కనిపించింది. అది ఎగరగలదని అంటారు. అయితే విషం వుండదుట! ఎంత పచ్చగా సన్నగా మెరిసిపోతోందో!

రెండు మూడుకప్పలు గట్టుమీంచి చెరువులోకి దూకి, తామరాకులమీదకి గెంతాయి. అలా గెంతడంతో, నీళ్ళు చుక్కలుగా తామరాకులమీద పడ్డాయి.. సూర్యుడి కిరణాలకి ఆ నీటి బిందువులు వజ్రాల్లా ప్రతిఫలించి నాకళ్ళకి మిరుమిట్లు గొలిపాయి . ఓహ్..!

తుంగగడ్డి కనిపించింది. పీకాను. నల్లని కాయలున్నై వేళ్ళ దగ్గర. వాటిని గిల్లి వాసన చూశాం. ఆహ్.. ఎంత అద్భుతమైన పరిమళం!

రెండు మూడు ఆరుద్రపురుగుల్ని కూడా చూశాం. వాటిని పట్టుకుని అరిచేతిలో పెట్టుకుని, వాటి వీపుని వేళ్ళతో నిమిరా. గులాబీ ఎరుపు కలిపిన రంగుతో వాటివీపు ముఖ్మల్ గుడ్డలా మెత్తగా ఉంది. కాసేపు వాటిని నిమిరి మళ్ళీ నేలమీద పెట్టేశా.

ఓ బురదగొడ్డు (పాము) నీళ్ళమీద పాకుతోంది. కాసేపు దాన్ని చూసేలోగానే, అది తామరాకుల మధ్యకి దూరి కనపడకుండా పోయింది.

తూము దగ్గరుండే తూమురాయిని ఎత్తాలని ప్రయత్నించా. నీళ్ళు తక్కువగా ఉన్నై. తూము రాయి ఎత్తినా లాభం ఏం వుందీ? కడుపులో కరకరలాడింది. గట్టుదిగి, అచ్చిరెడ్డి వాళ్ళ ఇంటి దగ్గరపెట్టిన సైకిలు తీసుకుని ఇంటిదారి పట్టాను.

మేతకి వొదిలిన ఆవులూ గేదెలూ దూడలూ, మేశాక ఎలా మళ్ళీ అలవాటుగా గొడ్లపాకని చేరతాయో, నేనూ అలాగే ఇంటికి చేరాను.

"బలాదూర్ తిరగటం అయిపోయిందా? మెక్కుదువు రా!" కొరకొరా చూస్తూ అన్నది మా అమ్మ. యీ తల్లులెప్పుడు మారతారూ?

**బల్బు వెలిగిందోచ్**

అంగుళం వెడల్పు ఎనిమిది అడుగుల పొడుగున్న పల్చని చెక్కబద్దలు. వాటిమధ్య 'గాళ్ళు'. ఆ గాళ్ళల్లో వైర్లుపెట్టి పైన మూతలాంటి బద్దల్తో మూసి యమా ఉత్సాహంగా వైరింగ్ చేస్తున్నాడు మా జిజ్జాగాడు. నాకంటే ఏడాదో రెండేళ్ళో వాడు పెద్ద. కానీ సినిమాహాల్లో 'రీళ్ళు' తిప్పి ఆర్డర్‌లో పెట్టడమే కాకుండా, 'ఆపరేటర్'గా కూడా పనిచేస్తాడు. ఇప్పుడు వాడు 'వైరింగ్'లో ఎక్స్‌పర్ట్ అయిపోయాడు. వాడితోపాటు వాళ్ళ 'గురువూ' వచ్చాడనుకోండి.

మొత్తానికి మా ఇంటికి 'కరెంటు' లక్ష్మి (దీపలక్ష్మి) రాబోతోంది. మానాన్నతో పాటు నేనూ, ఎక్కడెక్కడ బల్బులు బిగించాలో పురమాయించాం. స్విచ్చిలు నాకు అందకుండా వుండాలని మా అమ్మ కండిషను పెట్టిందిగానీ, "సీతకేవమ్మా.. రెండు నిముషాల్లో

'స్విచ్చి' ఎలా వెయ్యాలో నేను నేర్పుతాగా, అదీగాక 'స్విచ్చీలు' ఎత్తున పెడితే వాటిని 'ఆన్' చెయ్యడానికి మళ్ళీ ఏ స్టూలో తెచ్చుకోవాలి. మీకయితే అందనే అందవు!" అని జిజ్జాగాడు మా అమ్మ ప్రపోజల్‌ని కొట్టిపారేశాడు.

కరెంటు స్విచ్చి ముట్టుకుంటే 'షాక్' కొట్టి పిల్లలు చచ్చిపోతారని ఆవిడకి ఎవరో చెప్పారట.

"ఎవరూ?" అని అడక్కండి. ఆవిడకి ఇష్టంకాని పని అయితే, "ఆ పని అసలు మొదలు పెట్టనే కూడదుట. కరణం మామ్మగారు మొన్న చెప్పలేదూ!" అని ఎవరో ఒకరి పేరు చెప్పేది. ఆ విషయం నాకూ మా నాన్నకీ బాగా తెలుసు. ఇంకో విషయం ఏమంటే, మా అమ్మ నాకన్నా కాస్త పొట్టి. 'స్విచ్చి' వేసే మహర్దశ నాకు పడితే ఆవిడకి అవమానంకాదూ!

మా నాన్న 'వాల్వు రేడియో' కూడా ఒకటి కొనుక్కొచ్చాడు. కరెంటు రావడమే తరువాయి. ఫిటింగ్స్ అన్నీ అయిపోయాయి. కరెంటు వాళ్ళు వచ్చి మీటరు బిగించి కనెక్షన్ ఇవ్వాలి.

రోజుకి అయిదారు సార్లన్నా నేను కరెంటాఫీసుకుపోయి అక్కడవున్న 'సర్వమూర్తి' అనే బట్టతలాయన బుర్ర తినేసేదాన్ని.

"మీటర్లు లేవమ్మా.. ఇవ్వాళో రేపో వస్తై. అవి రాకండా కరెంటు ఇవ్వకూడదు!" అనేవాడు.

"హూ.!" డబ్బులు మాత్రం ముందరే కట్టించుకుంటారు! అయినా, మీ అంత గొప్ప 'ఆఫీసరు' ఆర్డరు వేసినా ఆ మీటర్లు రాలేదంటే ఏమనుకోవాలి!" అన్నాను. ఈ మంత్రం బాగా పనిచేసింది.

ఆయన గుమస్తా అని నాకు తెలిసినా 'ఆఫీసర్' అనేసరికి ఉబ్బితబ్బిబ్బై, "రేపిపాటికల్లా కరెంటు వచ్చేస్తుంది.. నువ్వెళ్ళిరా!" అన్నాడు.

సాయంకాలం నాలుగింటికల్లా ఆయనే స్వయంగా వచ్చి, వెంట వచ్చిన ఇంకో ఆయన మీటర్ బిగించాక స్విచ్చి వేసి, "ఇదీ నామాటంటే!" అని గర్వంగా అన్నాడు. బ్రహ్మాండగా లైటు వెలిగింది.

ఈ 'విజయవార్త' మా ఫ్రెండ్స్‌కి చెప్పి మా ఇంటికి రమ్మని పిలిచాను. అందరెదురుకుండా ఆరింటికి నేనే స్విచ్చి వేసి లైటు వెలిగించా. మావాళ్ళంతా 'స్విచ్చి' వేద్దామని ముచ్చట పడ్డారుగానీ, "షాక్ కొడితే ఎగిరిపడతారు. స్విచ్చి వేసేముందు 'కొన్ని' విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. లేకపోతే అంతే సంగతులు!" అని గంభీరంగా చెప్పాను. ఇది విని మా అమ్మ నావంక 'అదోలా' చూడటం నేను గమనించకపోలేదు.

"నిన్న నేను కరెంటు ఆఫీసుకి వెళ్ళినప్పుడు ఆయన నాకు చాలా విషయాలు బోధించారు. ఆ విషయాలు మా అమ్మకి కూడా నేను చెప్పలేదు!" అన్నాను. నేను గమనించిన విషయం ఆవిడ గమనించలేదని నాకు తెలుసు.

మా ఫ్రెండ్స్ వెళ్ళిపోయాక, "ఆ కరెంటాయన నీకేం చెప్పాడే సీతా.? నాకు చెప్పవూ!" అని మా అమ్మ బతిమాలింది.

"చెప్తాకానీ, కాస్త నీరసంగా వుందే అమ్మా!" అన్నాను.

"దానికేం.! కారప్పుసా రవ్వలడ్డూలూ వున్నాయిగా!" అని ఓ ప్లేటు నిండా రెండూ పెట్టి తెచ్చిచ్చింది. మంచినీళ్ళగ్లాసుతో సహా.

నేను తీరిగ్గా తిని, "పాయింట్ నంబరవన్.. తడిచేతుల్తో స్విచ్‌లని ముట్టుకోకూడదు. కాళ్ళకి కూడా తడివుండకూడదు." అన్నాను.

ఆవిడ వెంటనే పొడిగుడ్డతో చేతులు కాళ్ళూ తుడుచుకుని, "ఇప్పుడు వంటగదిలో లైటు నేను వెయ్యొచ్చా?" అని చాలా మర్యాదగా, వినయంగా అడిగింది.

"వెయ్యొచ్చు! ముందు నేను ఎలా వెయ్యాలో ఇంకోసారి చూపిస్తాను పద! " అని ముందు నడిచా. రెండుసార్లు ఆన్..ఆఫ్ చేసి ఆ తరవాత ఆవిడ్ని వెయ్యమన్నాను. బల్బు వెలిగాక చూడాలి ఆవిడ ఆనందం. "నువ్వెలాగైనా చాలా తెలివైన దానివే!" అన్నది.

"అవునేమో! కానీ నీ అంత తెలివైన దాన్నికాదే! కరెంటాయన 'గంట' చెబితేగానీ నాకు 'విషయం' అర్థంకాలేదు; నువ్వేమో క్షణంలో నేర్చేసుకున్నావు!" అని ఉబ్బేశా.

నాకు గ్యారంటీగా తెలుసు. ఆరోజు నాలుగయిదు 'స్పెషల్స్' చేసి ముదిగారంగా నాకు తినిపిస్తుందని.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments